# భారత భారతి

తెలుగుకథలు విరివిగా చదువుతూనే వుంటాం. ఇతర భారతీయ భాషలలో రచయితలు ఎలాంటి కథలు వ్రాస్తున్నారు? వారి రచనలలో సామాజిక స్పృహ, ప్రయోజనం, ప్రయోగాత్మకత ఎలా వున్నాయి?

మన పాఠకులకు యీ విషయాలు తులనాత్మకంగా పరిశీలించగల అవకాశం యివ్వాలనే సంకల్పంతో, ప్రతి నెలా ఒక భారతీయ భాషలోని కథను పరిచయం చేయదలచుకున్నాం. ఈ నెల తమిళ భాషలో కథ చదవండి. ఈ కథ సినిమా ప్రపంచానికి సంబంధించినది కూడాను.

# ఆకాశమంత కీర్తి

అనువాదం : 'చక్రవర్తి'

[తెరపైని సినిమాతారల హొయలు- వయ్యారం చూచి వాళ్ళంతటి అదృష్టవంతులు మరెవరూ లేరనుకుంటాం మనం. జీవితంలో అందరికీ వుండే యిబ్బంది పబ్బందులు, వృత్తిలో కష్టనష్టాలు వాళ్ళకూ వుంటాయి.

సినిమా రంగంలో ప్రాథమిక అంతస్థులలో వున్న ఒక 'తార' సెట్స్‌మీద ఎలా అవస్థ పడుతుందో ఈ తమిళ కథానికలో శ్రీ అశోక మిత్రన్ అతి చాకచక్యంగా రూపొందించారు. వీరు అనేక సంవత్సరాలు జెమినీ స్టుడియోస్‌లో పబ్లిక్ రిలేషన్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేశారు. ప్రస్తుతం ఒక తమిళ వార పత్రికకు సహాయ సంపాదకులుగా వుంటున్నారు.]

'లైట్స్' అని అరిచాడు డైరెక్టర్.

దాదాపు ఓ పాతిక దీపాలు వెలిగి ఆమె మీద కాంతి కురిపిస్తున్నాయి.

'సంగీతం' అన్నాడు మళ్ళీ డైరెక్టర్.

రికార్డ్ ఆన్ చేశారు. లౌడ్ స్పీకర్ లోనుంచి ఝుమ్మని సంగీతం అన్ని దిక్కులను ముంచెత్తుతోంది.

'ఏక్షన్' అన్నాడు ఈ మారు డైరెక్టర్.

ఆమె అప్పుడే జీవం పోసుకున్న పాములా మెలికలు ప్రారంభించింది. రికార్డర్ స్పీకర్‌లోంచి వస్తున్న పాటకు అనుగుణంగా పెదవులు కదుప సాగింది. చక్రాలవంటి కళ్ళు చుట్టూ చేతులు గిరగిర తిప్పుతూ అద్దంలో చూచుకుంటోంది.

కళ్ళు జిగేలుమని చురుగ్గా తిరుగుతున్నాయి. ఎడమచేయి నడుముమీద ఆనించుకుంది. కుడి వయిపుకు తిరిగింది. పాటలో మొదటి చరణం పూర్తయింది. ఇప్పుడు 'ఆర్కెస్ట్రా సంగీతం' వినవస్తోంది. దీనికి సరిపడే యాక్షన్ జోడిస్తూ ఆమె ఎదుర్రొమ్ములు అద్దంవైపు దూకించింది. మునివేళ్ళమీద నడుస్తూ అలమరా దగ్గరకు వెళ్ళింది. దాని తలుపులు తెరిచి లోపలనుంచి ఒక చీర బయటకు తీసింది. చీర భుజం మీద వేసుకుని తనవైపు తాను స్వాతిశయంగా చూచుకుంది.

'కట్ 'సంగీతం ఆపండి.'

అంతా నిశ్శబ్దం. ఆమె నీరసంగా డైరెక్టర్ వంక చూచింది. ఆయన గట్టిగా కళ్ళు మూసుకుని కుర్చీలో జారగిల పడివున్నాడు. ఆ పిక్చర్‌కు 'ప్రొడ్యూసర్' కూడా ఆయనే. అందుకనే 'ప్రొడక్షన్ క్రూ' అంతా ఆయన్ను అంటి పెట్టుకుని అదేజావ్, బదే జావ్ లుగా వున్నారు. ఆయన ఓ మారు తల ఊపి 'ఇంకో టేక్! అన్నాడు. ప్రొడక్షన్ క్రూ అంతా గాఢంగా నిట్టూర్చి ఎవరి జాగాలకు వాళ్ళు సర్దుకుని 'సర్వ సన్నద్ధం' చేయడంలో నిమగ్నులయ్యారు. ఆమె కూడా నాలుగడుగులు వేసి అద్దం ముందుకు చేరుకుంది. ఎవరైనా తన్ను పలకరిస్తే చాలు కసిగా మీద పడి కొరికేద్దామన్నంత పిచ్చిగా వుంది ఆమెకు. డైరెక్టర్ ఆమె కేవో సూచనలు యివ్వనారంభించాడు ఆమె విరుచుకు పడలేకపోయింది. విధేయంగా విన్నది.

"చూడు అమ్మాయీ, నువ్వు కాస్త సంతోషంగా వుండాలి. నవ్వుతూ తుళ్ళుతూ కేరింతలు కొడుతూ నటించాలి. ఏమిటట్లా అముదం తాగిన ట్లు ముఖం పెడతావు? హాయిగా కులాసాగా వుండు" అన్నాడు డైరెక్టర్. ఆమె అలా తయారవటానికి ప్రయత్నం చేసింది.

డైరెక్టర్ 'అంతా సిద్ధమేనా? అని అడిగాడు.

'ఒక్క క్షణం సార్' అన్నాడు క్లాపర్‌బాయి. అంటూనే క్లాపర్ బోర్డు మీద కొత్త అంకె వేశాడు. అసిస్టెంట్ డైరెక్టర్ తానుకూడా యేమయినా చేయక పోతే బాగుండదని కాబోలు, ఆమెతో 'చూడమ్మా, జయమాలా! పై వారమే నీ పెళ్ళి.అప్పుడు ఆ పెళ్ళిని తలుచుకుని సంతోషంగా ఆడుతూ పాడుతున్నావు. అందుచేత బాగా ఖుషీగా వుండాలి. అన్నాడు. నిజానికి యింత బ్రీఫింగ్ అవసరంలేదు జయమాలకు. ఆమె కంటే అసిస్టెంట్ డైరెక్టర్‌కే అవసరం అని పించేట్లుగా వున్నాడతను. నీరసంగా యిప్పుడో యింకాస్సేపటికో నేలమీదికి వొరిగి పోతాడనేట్లుగా. బహుశ అతడికి యిదివరకే పెళ్ళి అయిపోయి సంసార జామాటంలో పీకల్లోతు యిరుక్కు పోయి వుంటాడు.

క్లాపర్ బాయి రెడీ అయినాడు. అందరూ సిద్ధం అయినారు. 'టేక్' మళ్ళీ మొదలయింది. ఆమె కళ్ళతో విన్యాసం ముగించింది. హుషారుగా నడిచి ముందుకు వచ్చేస్తోంది. ఇంతలో డైరెక్టర్ 'కట్! కట్!' అని అరిచాడు. సింహంలా గర్జిస్తూ ఆమె మీద పడి

పోయాడు. 'ఎవడు చెప్పాడు నీకు ఆ నడుము మీద చేయివేసుకు నించోమని?'

ఆమెకు నిజంగా గుర్తుకు రాలేదు ఆ క్షణంలో, తనకు అలా చేయమని చెప్పిందెవరో. ఇంతవరకూ జరిగిన ఏడు 'షేక్స్'లోనూ ఆమె అలాగే నడుంమీద చేయి వేసుకుని నడిచింది. ఇది ఎనిమిదో 'షేక్' ఆమె నుదురంతా చెమటతో తడిసి ముద్దయింది. చెమట ముక్కు మీదనుంచి కారి కిందికి పడదామా వద్దా అని సందేహిస్తున్నట్లు ఆగింది. ఆమె చెమట విదిలించేసుకుని ఒక్కమారు రొమ్ము అదిలించింది. సెట్ మీద రెండు ఫాన్లు తిరుగుతు తున్నాయి. కాని వాటి గాలి ఆమెకు అందదు. ఆమెకే కాదు ఆ మూల కూర్చున్న ఆమె తల్లికి కూడా తగలదు. తండ్రిమాట సరేసరి. నిజానికి ఆమె తల్లి దండ్రులకు రెండు కుర్చీలు వేసి కూర్చోబెట్టారు ముందు. ఇంతలో ఎవరో 'ముఖ్యమైన మనిషి' సెట్ దగ్గరకు రావడంతో తండ్రిని లేపి ఆ కుర్చీ ఆయనకు అమర్చారు. తల్లిని కూడా లేపేవాళ్ళే కాని మరో ముఖ్యమైన మనిషి ఎవరూ యింత వరకూ రాలేదు, ఆయన పుణ్యమా అని.

ఆమె అద్దం ముందు నిలబడింది. నడుంమీద చేయి వేసుకోగూడదు. సరే అయితే ఏం చేయాలి? అన్నట్లు ఆలోచిస్తోంది. భయం భయంగా డైరెక్టర్ వంక తిరిగి అడిగింది. 'అయితే యీ మారు చెయ్యి ఎక్కడ పెట్టుకోమంటారు?'

'ఏమిటి నువ్వు అడిగేది? మూవ్‌మెంట్ షీట్‌లో ఎలా వ్రాసి వుంది?' అని తిరిగి ప్రశ్నించాడు డైరెక్టర్ కొద్దిగా ఆశ్చర్యపోయి.

ఆమె జవాబు చెప్పేందుకు జంకింది. అసిస్టెంటు డైరెక్టరుకూ, కన్‌టిన్యూయిటీ మాన్‌కు — సెట్‌లో యిందుకు సంబంధించిన వాళ్ళకందరికీ తెలుసు- ఆమె—రొమ్ములు ముందుకు విసిరికొట్టి, తర్వాత నడుంమీద చేయివేసుకొని విన్యాసం చేయాలని వ్రాసి ఉన్నదని. కాని ఆమె చెబితే తప్ప డైరెక్టరుకు ఇప్పుడు తెలిసేట్లులేదు. అందుకని ఆమె నింపాదిగా యిలా అంది : "నా చూపులతో నిన్ను చిత్తుచేస్తాను" అన్న చరణం పాడిన తర్వాత 'నీ మాయ మాటలన్నీ నమ్ముతా ననుకుంటున్నావా?' అని వాక్యం చెప్పి-అప్పుడు యీ విన్యాసం చేయాలని మూవ్‌మెంటు షీట్‌లో ఉంది. ఆమె ఆ మూవ్‌మెంటు చేసి చూపించటానికి ప్రయత్నించింది లైట్లు-కరెంటు- సంగీతం లేకపోయినా. ఈకారణంగా మూవ్‌మెంటు (కదలిక) బహు నీరసంగా వచ్చిందనికూడా ఆమెకు అనిపించింది. డైరెక్టర్ కాస్త చిరాగ్గా "యింతకు ముందు ఏం మూవ్‌మెంటు చేసేదాని వి" అని అడిగాడు. "సరిగా యిలానే చేసేదాన్ని సార్" అంది ఆమె.

"అట్లాగా?"

"అవునండీ!"

ఇప్పుడు అసిస్టెంటు డైరెక్టరు జోక్యం కలిగించుకొని "అవునండీ స్క్రిప్టులో అలాగే ఉంది. మీరు మూవ్‌మెంటు మార్చదలచు కున్నారేమోనని యింతసేపు మాట్లాడకుండా ఉన్నాను"

అన్నాడు.

"సరే, సరే. త్వరగా కానివ్వండి. ఊఁ....చకచకా!"

లైట్లు వెలిగాయి. సంగీతం ఆరంభమయింది. మళ్ళీ ఆమె వివాహ పూర్వపు కుప్పిగంతుల్లో మునిగిపోయింది. ఏదో ఎక్కడో లోపం జరిగినట్లు అనిపించింది ఆమెకు. రొమ్ములు అద్దంవైపు ఎగరవేసినప్పుడు తెలిసి వచ్చింది జరిగిన ఆ తప్పు యేమిటో. తను వేలికి పెట్టుకున్న పెద్ద ఉంగరం చీర తాలూకు ఎంబ్రాయిడరీలో చిక్కుకు పోయింది. ఆమె వేస్తున్నది పల్లెటూరిపిల్ల వేషం. అమాయకపు అమ్మాయి. మూడో సీను లోనే చనిపోతుంది. పల్లెటూరి పద్ధతులకు తగినట్లుగా యీ మోటు నగలు, ఉంగరాలు మొదలగునవి ధరించితీరాలి. ఈ 'చిక్కు' తొలగించుకుందుకు తనంతటాను 'యాక్షన్' ఆపుచేస్తే డైరెక్టరుతో మళ్ళీ చివాట్లు తినవలసి వస్తుంది. అందుచేత, ఎంతదూరం వీలయితే అంత దూరం కొనసాగిద్దామని అలాగే 'యాక్టు' చేస్తూ ఉండిపోయింది. కాని వీలవలేదు. యెంతో సేపు, ఎందుకంటే అలమర తలుపులు తెరిచేటప్పటికి — చీరకూడా ఆమె చేతులతో పాటు ముందుకు కదిలింది. రొమ్ములమీద ఏమీ ఆచ్ఛాదన లేకుండా తొలగిపోయింది. అంతమాత్రంతో ఆగిపోతే అందరికీ సంతోషంగానే ఉండేదేమోగాని, ఉంగరం యిటుఅటు రాపిడికి వేలిని మధ్యకు కోసేసింది.

ఆమె అద్దానికి ఎదురుగా నిలుచుంది. వేలు నొప్పితో భరించరాని బాధ అవుతోంది. ఉండి ఉండి ఆమె శరీరమంతా జివ్వుమని లాగేస్తున్నట్లుంది. ఎవరినీ ఏమనటానికి వీలులేదు. తల్లిమీద విపరీతమైన కోపం వచ్చింది. తల్లిమాత్రం తన కుర్చీకి అతుక్కుపోయి కూర్చుంది. లేచి కుమార్తె వైపు వెళ్ళాలని చూచింది. కాని ఎవరో సెట్ మీదనుంచి అరిచారు. సెట్ మీదికి ఎందు కింతమంది జనం పోగవుతున్నారని. దాంతో ఆమె భయపడి వెనక్కు తగ్గిపోవలసి వచ్చింది. తండ్రి కుర్చీ ఆక్రమించుకున్న ప్రముఖ వ్యక్తి యింకా అలాగే చోద్యం చూస్తూ ఉండిపోయాడు. అందుచేత ఆమె తండ్రి అలాగే ఓమూల ఒదిగి నిలబడి ఉండిపోవలసి వచ్చింది.

డైరెక్టరు ఖచ్చితంగా చెప్పివేశాడు: యింకొక్క 'టేక్' మాత్రమే తీస్తాననీ, తరువాత ఎలావస్తే అలాగే అఘోరించమనీని. అందుచేత అందరూ ఆమెను 'ఫైనల్ టేక్'కు ఆయత్త పరుస్తున్నారు. ఆమె వేలినుంచి కారుతున్న రక్తాన్ని కడిగారు. ఏదో మందు పూశారు ఇప్పుడు ఆమెకు ఎముకల వరకూ విపరీతమయిన నొప్పి, పైకిమాత్రం నవ్వుతూనే ఉండిపోవాలి. దుస్తుల ఆసామీ వచ్చి ఆమె పవిటీ, కుచ్చిళ్ళు సర్దాడు నిజానికి ఆ అవసరం యేమీలేదు. అయినా ఉన్న అవకాశాన్ని వినియోగించకుండా వదలివేయడు ఆ ఆసామీ. అమ్మాయి ఏమీ అనడానికి వీల్లేదు. బొమ్మలాగా నిలబడి ఉండిపోవాలి. ఎవరు ఏం చేసినాగానీ. చీర, కుచ్చిళ్ళు, బాడీ, బ్రా....ఇవన్నీ సర్దే మిషతో అతను ఆమె శరీరంలోని అతిసున్నితమయిన అంగాలన్నీ నిరాటంకంగా తడుముతాడు. నడుంపట్టుకు లాగు

తాడు. నడుము చుట్టూ చేతులువేసి బిగిస్తాడు. వేళ్ళతో సుకుమారంగా రాస్తాడు. గిల్లినట్లుగా చక్కలిగింతలు పెట్టినట్లుగా చేస్తాడు. అవన్నీ తననుకాదు—ఏగోడనో బల్లనో అన్నట్లుగా నిర్వికారంగా ఉండిపోవాలి అమ్మాయి.

దుస్తుల అసామీ సవరింపులు అయిపోవడంతోటే 'మేకప్‌మాను' తయారయినాడు. ఆమె ముఖానికి పౌడరు అద్దాడు. ఆమెకు విపరీతంగా చెమట పోస్తుంది. తడిసిపోతున్నకొద్దీ ఎక్కువ పౌడరు అద్దుతున్నాడు అతను. చౌక రకం సువాసన ద్రవ్యం చిలకరించాడు. గుడ్డతో ముఖం అంతా రుద్ది తుడిచాడు మరోసారి. పౌడరంతా అట్టలట్టలుగా ఊడి పైకి వస్తోంది ఆమెకోసం అయితే యిలాంటి చౌకబారు పౌడర్లు తెస్తారు. పెద్ద తారలకు మాత్రం ఖరీదయిన, సువిన్నితమయిన పౌడర్లు తెస్తారు. యిష్టం ఉన్నా లేకపోయినా. హాలీవుడ్ నుంచి వచ్చే 'స్మగుల్డు' ద్రవ్యాలన్నీ వాళ్ళకోసం అట్టే వుంచుతారు. ఆమె యింకా చిన్నతార. పెద్ద మనిషి అయి మూడేళ్లే అయింది. ఈ మూడేళ్ళు అందరూ ఆమె వంక ఆశగా అబగా చూస్తున్నారు. ఏమయినా, యిలాంటి చిన్నవేషాలు—ఒక సీనులో పుట్టి రెండో సీనులో చనిపోయే వేషాలు వేయాలంటే ఆమెకు చిరాగ్గానే ఉంది. వీటితోనే తన 'తెర బతుకు' అంతా ముడిపడిపోయిందా అని భయం వేస్తోంది ఒక్కోసారి. బయట తిరిగేటప్పుడు తాను ఎంతో శ్రద్ధగా మేకప్ చేసుకోవలసి వుంటుంది. ఘరానా కోసం పాతకాలపు రథంలాంటి ఓ కారు పెట్టుకోవలసి ఉంది. తనకూ ఓ స్టేటస్‌ఉన్నదని చెప్పుకుందుకు, స్టూడియోలకు వెళ్ళేటప్పుడు తండ్రినో, తల్లినో, లేక యిద్దర్నీనూ వెంటపెట్టుకు వెళ్ళాల్సి ఉంది.

మేకప్‌మాను ఆమె కనుబొమ్మలు బ్రష్‌తో దిద్దనారంభించాడు. బ్రష్‌చివర్లు కళ్ళ పాపలకు తగులుతున్నాయి. చాల బాధగా ఉంది. కాని పైకేమీ అనటానికి లేదు. కళ్లుమూసుకుందుకూ లేదు. గునపాలతో కళ్ళలో పొడుస్తున్నా అలా తెరుచుకొనే ఉండిపోవాలి. దూరంగా కూర్చున్న తల్లివంక చూసింది—నిస్సహాయంగా.

కళ్ళ తరవాత పెదవుల వంతు. ఎర్రగా, రక్తం ఓడుతున్నట్లుగా రంగు వేస్తున్నారు పెదాలకు. ఆమెమనసులోనే—తన వాక్యాలు, కదలికలు గుర్తుతెచ్చుకుంటూ గమనంలో పెట్టుకోవటానికి ప్రయత్నిస్తూ వుంది. తన పనిమీద మనస్సు లగ్నంచేయటానికి పూనుకుంది. పెదవులమీదఎక్కువైపోయినరంగురసం తుడిచివేసుకుందుకు మేకప్‌మాను ఆమెకు టాయిలెట్ పేపరు ఇచ్చాడు. మేకప్ పూర్తయిందిగనుక, తనపనిలో నిమగ్నం అయ్యేందుకు చూచింది ఆమె.


రెండు మూడు క్షణాల సమయం వుంటేచాలు, అనుకుంటూ వుండగా కీలైట్లు వెలిగాయి. ఆమె ఎంతో శ్రద్ధగా - జాగ్రత్తగా నటించాలని తీర్మానించుకుంది. ప్రగాఢమయిన సంకల్పం చేసుకుంది. కాని ఏదో ఎక్కడో లోపం జరిగిపోయింది. ఏదో బాధ మనసును కలచివేస్తోంది. తన

తంత్రి ముందు కూర్చుండిన కుర్చీలో యిప్పుడు తిష్టవేసిన ప్రముఖ వ్యక్తి అంతదూరంనుండి కూడా తనను అవు రావురుమని మింగేసేట్లు చూస్తున్నాడు. కబళించివేద్దామని కాసుకోనున్న రాక్ష సుడిలా వున్నాడు అత నామె కళ్ళకు. కెమెరామాన్ అమెను ఒక్క అంగుళం ఎడమవైపు తిరగమన్నాడు. ఆమె జరిగింది. మరికాస్త జరగమన్నాడు - ఆమె అలాగే చేసింది. మనసు చిక్క బట్టుకుందుకు ప్రయత్నం చేసింది. ఇంతలో అసిస్టెంట్ డైరెక్టర్ అలమార దగ్గరకు పరుగెత్తి తలుపులు గట్టిగా బిగించేశాడు. తీరా తను తీయవలసి వచ్చినప్పుడు అది అంత తేలికగా తెరుచు కోదేమోనని ఆమెకు భయం. ఇప్పు డింక ఆమె అనాసక్తంగా తయారయి పోయింది. ఏమీ ప్రయత్నం చేయడం లేదు. భయపడటం మానేసింది. భగ వంతుడిని ప్రార్థించడం మానింది. అద్దంముందు నిలుచుంది. అంతా సన్నద్ధం అయింది. లైట్లు వెలిగాయి, పాట ప్రారంభం అయింది.

ఆమె ఒకమారు విన్యాసం చేసింది. ఎదురుగా తల్లి కనిపిస్తోంది. సెట్‌ను అనుకునే చాలమంది నిలబడివున్నారు. ఆమెనే గమనిస్తున్నారు. తల్లికోసరం కాకపోతే, యీ చిన్న నటన యింత మంది ముందు యిన్నిమార్లు చేసేదికాదు తాను. చేసిందే చేస్తూవుండడం ఎంత చికాకు. ఎంత అవస్థ! అమ్మ అమ్మ! తన కూతురును యెవరు యెన్ని రకా లుగా తాకినా, తట్టినా, ఆలింగనం చేసు కున్నా చీమకుట్టినట్లయినా బెదరని అమ్మ! పెద్దవాళ్ళు, కొద్దివాళ్ళు, సువాసనలు పూసుకున్నవాళ్ళు, మురికికంపు కొట్టే వాళ్ళు - ఎంతమంది తనను ఒత్తినా - ఏమీ జరగనట్లే కూర్చుండిపోయే అమ్మ!

ఆమె తన చూపులతోనే 'చిత్తు' చేసే స్తోంది. ఆ మాయమాటలను నమ్మటం లేదు అంటోంది. విన్యాసంగా కదులు తోంది. రొమ్ము అద్దంవైపు కుప్పిం చింది. అద్దంలో డైరెక్టర్ ముఖం, ఆ ముఖంలోని చిరాకు నైరాశ్యం అమెకు కొట్టవచ్చినట్లుగా కనిపించాయి. అతనూ అందరిలాంటి మనిషే. ఆరోజు, తనూ తల్లి అతని గదిలోనికి వెళ్ళినప్పుడు, కాంట్రాక్టు కాగితాలమీద సంతకాలు చేయడంకోసం అక్కడ గంటసేపు కూర్చుని వుండిపోవలసి వచ్చింది. అప్పు డతను గదిలో మరోమనిషి లేనట్లుగానే ప్రవర్తించాడు తనతో. తల్లి అలా ఒక కుర్చీలో కూలబడివుండి ఒల్లమీది పేపర్ వెయిట్లు పరిశీలిస్తూ వుంది. అదీ తన తల్లి మనస్తత్వం! వ్యవహారం! కూతురుకు ఏమైనా తనకేం పట్టనట్లే, గోడలా వుండిపోగలుగుతుంది. మళ్ళీ అంటుంది: 'నాకేం అక్కర్లేదు, నువ్వు గొప్ప తారవై అకాశమంత కీర్తి సంపాదించి ప్రతిష్టగా బతికితేచాలు అంటుంది. అందరూ నీ చుట్టూ భజనలుచేస్తూ తిరు గుతూవుంటే చూడాలని వున్నది' అంటుంది.

ఆమె మునివేళ్ళమీద నడుస్తూ రెండో మారు అలా తిరుగుతూన్నప్పుడు తల్లి మళ్ళీ కనిపించింది. కొంగలాగ మెడ ముందుకు జాపుకుని తన నటననే పరిశీ




లిస్తోంది. ఆమె నటన పూర్తి అయింది. ప్రాణానికి ఎంతో హాయిగా వున్నట్లుంది. హృదయానికి ఎంతో తేలిక అయిపోయింది. తండ్రి ఓ మూలనక్క నిలబడి వున్నాడు. ఆ ప్రముఖవ్యక్తి తన పమిట మళ్ళీ జారుతుందేమో తప్పతీరా చూద్దామని ఒళ్ళంతా కళ్ళుచేసుకుని వున్నాడు. అసిస్టెంట్ డైరెక్టరు తన 'బాస్' ముఖకవళికలు గమనిస్తూ నిలుచున్నాడు. లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. లౌడ్‌స్పీకర్ రణగొణ ధ్వనులు చేస్తోంది. కెమేరా కిర కిరమంటూ తిరుగుతోంది. ఆమె మటుకు పక్షి ఈకకంటే తేలికగా కదలాడుతోంది. ఎందుకంటే ఆమెకు అతని దూరంలోనే, తల్లి అదుర్దాగా ఆసక్తిగా గమనిస్తూ కూర్చుంది. ఆమె చూపులకు అడ్డంగా ఎందరెందరో నిలబడి వున్నారు. అయినా అదంతా యిప్పుడేం లెక్కలోని విషయంగా అనిపించడం లేదు ఆమెకు.

'సంగీతం ఆపండి. టీ బ్రేక్' అన్నాడు డైరెక్టర్ - తరవాత ఆమె వైపుచూచి 'కాస్త హుషారుగా నటించరాదూ?' అన్నాడు.

ఆమె ముక్కు ఎడమవైపు దురదగావుంది. ఒక్కమారు చీదుకోవాలనిపిస్తుంది. తల్లి చేతిలోని జేబురుమాలు ఎగిరి అందుకుంది. ఆ రుమాలు అప్పటికే తడిసిపోయి వుంది.